క్లుప్తంగా

వ్యక్తిగత రుణాలకు దరఖాస్తు చేసుకోండి

కంకిపాడు: వ్యక్తిగత రుణాలకు అర్హులు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ పి.అనూష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ కార్పొరేషన్ ద్వారా వ్యక్తిగత రుణాలు, జనరిక్ ఫార్మసీ ఏర్పాటుకు అర్హత గల బీసీ, ఈబీసీ, కాపు, కమ్మ, రెడ్డి, క్షత్రియ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, మేదర, కుమ్మరి శాలివాహన అభ్యర్థులు నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులు ఈ నెల 22వ తేదీ లోపు http://apobmmr.apcfrr.in లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. కంకిపాడు మండలానికి రూ.1.93 కోట్ల విలువ గల 84 యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు.

చర్చికి టైల్స్ అందజేత



పెనమలూరు: మండలంలోని వణుకూరు గ్రామంలో నిర్మాణంలో ఉన్న దైవ స్వరూపి చర్చికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి రూ.32 వేలు విలువ చేసే టైల్స్ బహూకరించారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ నాయకులు టైల్స్‌ను చర్చి ఫాదర్‌కు గురువారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చక్కా గోపీ, దయ్యాల కిషోర్, వణుకూరు నాగరాజు, వణుకూరు కోటయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పెనమలూరు: మండలంలోని గంగూరులో గురువారం రూ.8.75 లక్షలతో రోడ్డు, డ్రెయినేజీ, రూ.3.75 లక్షలతో కబరస్తాన్ రోడ్డు నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. దీనికి అందని సహకారం కావాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నేతలు అక్బర్‌బాషా, కోయా ఆనంద్‌ప్రసాద్, ప్యారీలతీఫ్, అబ్దుల్‌కలాం, సంగెపు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రవికుమార్



గన్నవరం: బార్ అసోసియేషన్ ఆఫ్ గన్నవరం శాఖ నూతన అధ్యక్షుడిగా గారపాటి రవికుమార్ ఎన్నికైనట్లు ఎలక్షన్ నిర్వహణాధికారి, న్యాయవాది జీఎస్ఆర్. మూర్తి తెలిపారు. ఈ మేరకు గురువారం ఏకగ్రీవంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం వివరాలను ఆయన వెల్లడించారు. ఉపాధ్యక్షుడిగా లోకం వేణుబాబు, ప్రధాన కార్యదర్శిగా రామకూరి ప్రకాశరావు, కోశాధికారిగా ఆర్. విమల్‌కుమార్ ఎన్నికైనట్లు తెలిపారు. సంయుక్త కార్యదర్శిగా వీవీఎల్ఎన్. మూర్తి, మహిళా రెప్రజెంటేటివ్‌గా ఎల్. భాగీరథి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా జీ సీతారామయ్యను ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సీనియర్ న్యాయవాదులు కేవీ. రమణ, ఎ. వెంకటేశ్వరరావు, టి. వెంకట్రావు, వైఆర్. శారద, ఎస్‌జీ. నీరజ, ఎ. సోమేశ్వరరావు, నల్లమోతు రమేష్, పి. శ్రీనివాసరావు, చంద్రశేఖర్ రెడ్డి సత్కరించి అభినందించారు.

ఆధార్ క్యాంపులను వినియోగించుకోవాలి



కంకిపాడు: ఆధార్ క్యాంపులను వినియోగించుకోవాలని ఉయ్యూరు డీఎల్‌డీఓ రాజేష్ సూచించారు. కంకిపాడులో నిర్వహిస్తున్న ఆధార్ ప్రత్యేక క్యాంపును గురువారం ఆయన పరిశీలించారు. 0–6 ఏళ్ల లోపు చిన్నారులకు ఆధార్ నమోదుకు ఈ ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్న సర్వేతీరును పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఇరువర్గాల ఘర్షణ.. పరస్పర ఫిర్యాదులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం రంగన్నగూడెంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణపై వీరవల్లి పోలీస్‌స్టేషన్‌లో గురువారం పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. గ్రామానికి చెందిన గుండపనేని రఘు, ముప్పా సాంబశివరావు తనపై అకారణంగా బుధవారం దాడి చేసి గాయపర్చారని కొలుసు రంగారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడిలో తీవ్రంగా గాయపడటంతో ఆస్పత్రిలో చికిత్స పొందినట్లుగా పేర్కొన్నారు. అట్లాగే కొలుసు రంగారావు, మరికొందరు తమపై దాడి చేశారని రఘు, సాంబశివరావు కౌంటర్ ఫిర్యాదు ఇచ్చారు. ఎస్ఐ శ్రీనివాసు దర్యాప్తు చేపట్టారు.

తాడిగడపలో

నీటి పన్ను బాదుడు

- ముున్సిపాలిటీలో పన్నుల టార్గెట్ రూ.5.50 కోట్లు
- రూ.4,800 డిమాండ్ నోటీసులు జారీ
- లబోదిబోమంటున్న ప్రజలు

పెనమలూరు: కూటమి పాలనలో తాడిగడప మున్సిపాలిటీలో నీటి పన్నులు బాదుడుకు తెరలేపారు. ఎన్నికల సమయంలో 'టీడీపీ గెలవాలి–ప్రజల తలరాత మారాలి' అని కూటమి ప్రకటించిన హామీల్లో ఉచిత కుళాయి హామీ కూడా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత హామీని తుంగలో తొక్కి ఇప్పుడు తాడిగడప మున్సిపాలిటీలో నీటి పన్నులు చెల్లించాలని డిమాండ్ నోటీలు ఇచ్చి బాదుడు కార్యక్రమం మొదలుపెట్టారు. వివరాల్లోకి వెళితే తాడిగడప మున్సిపాలిటీ 2020 డిసెంబర్‌లో ఆవిర్భవించిన సమయంలో కానూరు, యనమలకుదురు, పోరంకి, తాడిగడప గ్రామాలను విలీనం చేసి తాడిగడప మున్సిపాలి టీని ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీగా ఉన్న కాలంలో కుళాయి కనెక్షన్‌కు ఏడాదికి రూ.600 మాత్రమే పన్ను కట్టించుకునే వారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలనలో తాడిగడప మున్సిపాలిటీ ప్రజలపై ఎటువంటి పన్నుల భారం మోపకూడదని నీటి పన్నులు వసూలు చేయలేదు. మున్సిపాలిటీ ప్రాంతంలో ఎటువంటి నీటి కొరత రాకుండా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు కూడా తీసుకుంది. కృష్ణానది జలాలు సైతం మున్సిపాలిటీలో ప్రజలకు అందించింది.

వచ్చే ఏడు నీటి పన్నులు పెరిగే అవకాశం..?

వచ్చే సంవత్సరం నుంచి నీటి పన్నుల బాదుడు ఇంకా పెరిగే అవకాశం ఉందని సమాచారం. ఇప్పుడు నెలకు రూ.100 చొప్పున సంవత్సరానికి రూ.1,200 నీటి పన్నులు వసూలు చేస్తున్నారు. 2025–2026 ఆర్థిక సంవత్సరం నుంచి సంవత్సరానికి నీటి పన్నుల రూ.1,200 నుంచి రూ.2,400 పెరిగే అవకాశం ఉంది.

తాగునీరు సరఫరా అంతంత మాత్రమే

తాడిగడప మున్సిపాలిటీలో తాగునీటి సరఫరా అంతంత మాత్రంగానే ఉందనే విమర్శలున్నాయి. ప్రజలకు కావాల్సిన నీరు అందించటంపై దృష్టి పెట్టని ప్రభుత్వం పన్నుల బాదుడుపై అత్యుత్సాహం చూపటంపై ప్రజలు మండిపడుతున్నారు. గత ప్రభుత్వం నీటి పన్నులు వేయలేదని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం నాలుగు సంవత్సరాల నీటి పన్నులు ఒకేసారి వేయటమేమిటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీటి పన్నులు వేయాలనుకుంటే ఈ ఏడాది నుంచే వేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



యనమలకుదురులో వాటర్ ట్యాంక్

డిపాజిట్ ఎత్తేయాలి

తాడిగడప మున్సిపాలిటీలో కుళాయి కనెక్షన్‌లకు డిపాజిట్ ఎత్తివేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. యనమలకుదురు, కానూరు ప్రాంతాల్లో గతంలో అనేక అక్రమ కుళాయి కనెక్షన్‌లున్నాయని ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం ఉచిత కుళాయి కనెక్షన్ అని ఎన్నికల్లో ప్రకటించినందున అన్ని కుళాయి కనెక్షన్‌లు క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు. అలాగే ఈ ఏడాది నుంచే నీటి పన్నులు వసూలు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. తాడిగడప మున్సిపాలిటీలో జనాలపై పన్నుల బాదుడు ఆపక పోతే గుణపాఠం తప్పదని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

నీటి పన్నులు ఉపసంహరించుకోవాలి



నీటి పన్నులు వేసి ప్రజలపై భారం మోపటం తగదు. అధికారంలోకి వచ్చిన తరువాత కూటమి పాలన బట్టబయలైంది. ఇప్పటికే ఇంటి పన్నుల భారం ఎక్కువైంది. నీటి పన్నులు ఉపసంహరించుకోవాలి.

– ఉప్పాడ త్రిమూర్తి, సీపీఎం మండల కార్యదర్శి, పెనమలూరు

పన్నుల బాదుడికి తెరలేపిన కూటమి

తాడిగడప మున్సిపాలిటీలో నీటి పన్నులు బాదటానికి పాలకులు తెరలేపారు. 2021–2022 సంవత్సరం నుంచి 2024–2025 సంవత్సరాలకు అంటే నాలుగేళ్లకు తాగునీటి పన్నులు వసూలు చేయాలని పాలకులు నిర్ణయించారు. ఏడాదికి రూ.1,200 చొప్పున నాలుగేళ్లకు రూ.4,800 నీటి పన్నులు చెల్లించాలని గృహాల యజమానులకు డిమాండ్ నోటీసులు ఇస్తున్నారు. పైగా ఒకేసారి రూ.4,800 చెల్లించాలని లేక పోతే కుళాయి కనెక్షన్‌లు తొలగిస్తామని మున్సిపాలిటీ అధికారులు హుకుం జారీ చేశారు. ఈ లెక్కన నాలుగేళ్లకు రూ రూ.5.50 కోట్లు నీటి పన్నులు టార్గెట్ పెట్టుకుని బాదుడు మొదలు పెట్టారు. ఒక పక్క ఇంటి పన్నుల బాదుడుతో ప్రజలు గగ్గోలు పెడుతుంటే, దీనికి తోడు నీటి పన్నుల బాదుడు కూడా తోడవ్వటంతో మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. టీడీపీ గెలవాలి–ప్రజల తలరాత మారాలనే నినాదంతో ఎన్నికల్లో దిగిన కూటమి ఇప్పుడు పన్నులు వేసి బాదటమేమిటని ప్రజలు పాలకులను ప్రశ్నిస్తున్నారు. కుళాయి పన్నులు కట్టే సమస్యే లేదని స్థానికులు తెగేసి చెబుతున్నారు.



తాడిగడప మున్సిపాలిటీ కార్యాలయం

కామన్ స్థలం చుట్టూ ఫెన్సింగ్ నిర్మించాలి

అంబాపురం(విజయవాడరూరల్): అంబాపురం గ్రామంలో ఆర్ఎస్ నంబరు 97/2లోని కామన్ స్థలం చుట్టూ ఫెన్సింగ్ నిర్మించాలని తహసీల్దారు బి.సుగుణ గ్రామ పంచాయతీ కార్యదర్శి డి.శ్రీనివాసరావుకు చెప్పారు. కామన్ స్థలాన్ని గురువారం తహసీల్దార్ పరిశీలించారు. ఈ స్థలాన్ని ఆక్రమించుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని తన దృష్టికి వచ్చిందన్నారు. ఆక్రమణలకు గురికాకుండా చుట్టూ ఫెన్సింగ్ నిర్మించాలన్నారు. చలివేంద్రాన్ని, ఇతర ఆక్రమణలు తొలగించాలని కార్యదర్శికి చెప్పారు.

కబ్జాకు గురికాకుండా చర్యలు

అంబాపురం గ్రామ పరిధిలో కామన్ స్థలాలు కబ్జాకు గురికాకుండా చర్యలు చేపడుతున్నట్లు గ్రామ సర్పంచ్ గండికోట సీతయ్య విలేకరులకు తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలో మొత్తం 15 కామన్ స్థలాలున్నాయన్నారు. వాటన్నిటికీ గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు ఆయన తెలిపారు. పాలకవర్గ సభ్యుడు వసంత పాల్గొన్నారు.



కామన్ స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సుగుణ

విద్యార్థుల రక్తదానం



పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థులు గురువారం రక్తదానం చేశారు. కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్, ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం జరిగింది. విద్యార్థులు చురుకుగా పాల్గొని 24 యూనిట్ల రక్తదానం చేశారు. విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ టి.వెంకటేశ్వరరావు, రెడ్‌క్రాస్ వైద్య బృందం పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

పెనమలూరు: గంగూరు గ్రామంలో వ్యక్తి అదృశ్యమైన ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. గంగూరులో సత్యకళ మిల్లులో ఎం.ప్రసాద్ అనే వ్యక్తి పని చేస్తున్నాడు. అతడితో తల్లిదండ్రులు, అన్న మోహన్‌రావు కలిసి ఉంటున్నారు. మోహన్‌రావు జానకిరామయ్య గోదామ్‌లో ముఠా పని చేస్తున్నాడు. అయితే గత నెల్లో మోహన్‌రావు ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. అతడి కోసం కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికారు. మోహన్‌రావు ఆచూకీ తెలియలేదు. దీంతో ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎస్సీ వర్గీకరణకు శాసన సభలో ఆమోదంపై హర్షం

నున్న(విజయవాడరూరల్): ఎస్సీ వర్గీకరణకు ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ఏకగ్రీవ ఆమోదం పొందడం హర్షణీయమని గన్నవరం నియోజకవర్గ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ బాధ్యులు మంద వేణు మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ 30 ఏళ్ల పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణకు శాసనసభలో ఏకగ్రీవంగా ఆమోదం లభించిందన్నారు. గురువారం నున్న గ్రామంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ ర్యాలీ నిర్వహించి, మందకృష్ణ మాదిగ చిత్ర పటానికి పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో గ్రామ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు తగరం సుబ్బారావు, కమిటీ సభ్యులు చిల్లిముంత కోటేశ్వరరావు, దేవదాసు, పరస చైతన్య, జూన పూడి కృష్ణ, గెడ్డం సుధాకర్, ఉయ్యూరు రాజశేఖర్, కలపాల అబ్రహాం, తగరం విజయ్‌కుమార్, ప్రత్తిపాటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



విజయోత్సవ ర్యాలీలో ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు, కార్యకర్తలు

ఘనంగా బాబా మందిర వార్షికోత్సవం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని షిర్డీ సాయిబాబా మందిర వార్షికోత్సవ పూజలు గురువారం ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు శ్రీనివాసరావు, రాజేశ్వరశర్మ నేతృత్వంలో సాయిబాబాకు పుష్పార్చన, అష్టోత్తర శతనామావళి నిర్వహించారు. గ్రామానికి చెందిన లంక రవితేజ, యామిని దంపతులు షిర్డీ సాయిబాబాకు రూ.35 వేలు విలువ చేసే వెండి పూజా సామగ్రిని బహూకరించారు. ఆలయ కమిటీ సభ్యులు కోడెబోయిన బాబి, రావి ఈశ్వర్, లంక బేబి సరోజిని, సాయికృష్ణ, రత్నకుమారి, నాగమణి పాల్గొన్నారు.



షిర్డీ సాయిబాబాకు వెండి పూజా సామగ్రిని బహూకరిస్తున్న భక్తులు

ముగిసిన సురభి నాటకోత్సవాలు

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ, దక్షిణ మండల సాంస్కృతిక కేంద్రం తంజావూరు ఆధ్వర్యంలో దుర్గాపురంలోని సంగీత కళాశాల్లో నిర్వహిస్తున్న సురభి పద్యనాటకోత్సవాలు గురువారం ముగిశాయి. చివరి రోజు కార్యక్రమంలో సురభి ఆర్ట్స్ అసోసియేషన్, సురభినాట్య కళామండలి ఆధ్వర్యంలో మాయాబజార్ నాటికను ప్రదర్శించారు. నాటకంలో నిర్వాహకులు ప్రదర్శించిన అంశాలు సురభినాటక వైభవాన్ని చాటాయి. ముఖ్యంగా ఘటోత్కజుడి ప్రవేశం, మాయా శశిరేఖ వివాహం తదితర అంశాలు ఆకట్టుకున్నాయి.

నాటకంతోనే కళాకారుల జీవన ప్రయాణం

నాటకంతోనే సురభి కళాకారుల జీవన ప్రయాణం సాగుతుందని, సాంకేతికంగా వస్తున్న మార్పులను వారు ప్రదర్శనలో ఏర్పాటు చేస్తారని కూచిపూడి నాట్యాచారిణి స్వర్ణలత అన్నారు. ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలో కుటుంబ సభ్యులందరూ నాటకం కోసమే జీవించడం అరుదైన సంఘటనగా అభివర్ణించారు. సంగీత కళాశాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు తమ పాకెట్‌మనీలోనుంచి వారికి విరాళం అందజేశారు. సాంస్కృతిక శాఖ నిర్వాహకుడు సుమన్, నర్తనం పత్రిక ప్రధాన సంపాదకురాలు మాధవి పురాణం పాల్గొన్నారు.



మాయాబజార్ నాటకంలోని సన్నివేశాలు

అత్యాచార నిందితులను శిక్షించాలి

గన్నవరం: మండలంలోని వీరపనేనిగూడెంలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావుకు వైఎస్సార్ సీపీ తరఫున ఆ పార్టీ నేతలు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు మాట్లాడుతూ బాలికకు మాయమాటలు చెప్పి కొంత మంది సామూహిక అత్యాచారానికి పాల్పడడం అత్యంత దుర్మార్గమన్నారు. ఇటువంటి నేరాలు పునరావృతం కాకుండా ఈ కేసులో నిందితులకు త్వరితగతిన శిక్ష పడే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత బాలికకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణలో ప్రభుత్వం విఫలమవుతుండడం కారణంగా ఇటువంటి నేరాలు తరచుగా జరుగుతున్నాయని చెప్పారు. ఆడబిడ్డలకు రక్షణ లేకుండా పోతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆడబిడ్డల రక్షణకు కఠిన చట్టాలను తీసుకురావాలని కోరారు. ఎంపీటీసీ సభ్యుడు తిరివీధి రవి, వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం జిల్లా నాయకులు నిడమర్తి రామారావు తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

ఉంగుటూరు: వేంపాడు గ్రామ శివారు పొలాల్లో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను ఉంగుటూరు పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. గ్రామ శివారులో పేకాట ఆడుతున్న సమాచారంతో ఎస్ఐ గోవిందు తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.400 స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులను గన్నవరం కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హుండీ ఆదాయం రూ.3.87 లక్షలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట చల్లపల్లి బంగ్లా సమీపంలో వేంచేసి ఉన్న శ్రీ కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థాన హుండీ ఆదాయం రూ.3.87 లక్షలు వచ్చినట్లు ఈఓ వై సీతారామయ్య తెలిపారు. గురువారం దేవస్థానంలో ఆలయానికి చెందిన నాలుగు హుండీల కానుకలను లెక్కించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు అప్పన సదాశివ సూర్యనారాయణ, దేవదాయ ధర్మాదాయ శాఖ పర్యవేక్షణ అధికారిగా సుజన్, రెవెన్యూ అధికారి పద్మకుమారి, పోలీస్ పర్యవేక్షణలో కానుకలను లెక్కించారు. 90 రోజుల గాను ఆలయ హుండీ ఆదాయం రూ. రూ.3,87,121 వచ్చినట్లు ఈఓ తెలిపారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

పి.నైనవరం(విజయవాడరూరల్): పి.నైనవరం గ్రామంలోని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ గురువారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. గ్రామంలో ఇళ్లు లేని 286 కుటుంబాలకు స్థానిక కుక్కల వాని కుంటలో స్థలాలను ఇవ్వాలని మహిళలు గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి కుక్కలవానికుంట వద్దకు ర్యాలీ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వరావు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా ఇళ్ల స్థలాలకోసం స్థానికులు పోరాటం చేస్తున్నా అధికారులు స్పందించడంలేదన్నారు. జిల్లా నాయకుడు కోట కల్యాణ్ మాట్లాడుతూ గ్రామంలోనే పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఆందోళన చేస్తున్న విషయాన్ని తెలుసుకుని ఆ ప్రాంతానికి వచ్చిన తహసీల్దార్ బి.సుగుణ మాట్లాడుతూ గ్రామంలో భూసేకరణ చేసిన పిమ్మట పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేయడం సాధ్యమవుతుందన్నారు. ర్యాలీ ప్రశాంతంగా జరిగేందుకు టూటౌన్ సీఐ కొండలరావు బందోబస్తుతో పర్యవేక్షణ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మాతంగి ఆంజనేయులు, జీవీ రంగారెడ్డి, దావు శ్రీనివాసరావు, జమున, విజయ, అవిశ్రాంతమ్మ, సట్టు శ్రీనివాసరావు, సీహెచ్ రాంబాబు పాల్గొన్నారు.



వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన

రహదారిపై చేరిన మురుగునీరు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు బల్లెంవారి వీధిలో డ్రెయిన్లు పూడుకుపోవడంతో మురుగునీరు ప్రధాన రహదారిపై చేరింది. పక్క గ్రామమైన ప్రసాదంపాడులోని పలు అంతర్గత డ్రెయిన్లలో మురుగునీరు పారుదల లేకపోవడంతో ఈ సమస్య ఏర్పడింది. దీంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారిపై దుర్గంధంతో కూడిన మురుగునీరు నిలిచిపోయింది. డ్రెయిన్లలో మురుగు పైకి ఎగదన్నడంతో రహదారి బురదమయంగా మారింది. దీంతో సమీప ప్రాంతవాసులు, ప్రయాణికులు, ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. డ్రెయిన్లు పూడుకుపోవడంతో మురుగు సజావుగా పారుదల ఉండటం లేదని పలువురు చెబుతున్నారు. పలు దుకాణాలు, నివాసితులు డ్రెయిన్లలో చెత్త, వ్యర్థాలు డంప్ చేస్తున్నారని తెలిపారు. ఈ సమస్యపై పంచాయతీ కార్యాలయంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రెయిన్ల పూడిక తీయించాలని ఈ మురుగు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



బల్లెంవారి వీధి ప్రధాన రహదారిపై చేరిన మురుగునీరు

భక్తులకు అన్నసమారాధన

పెనమలూరు: కానూరులో శ్రీ తిరుపతమ్మ తిరనాళ్ల సందర్భంగా భక్తులను గురువారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరపతమ్మ వారి ఆలయ ప్రథమ వార్షిక తిరనాళ్ల మహోత్సవం ఘనంగా చేశారు. ఈ సందర్భంగా భక్తులకు గురువారం అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అన్నసమారాధనలో భక్తులకు భోజనం పెట్టారు. సుమారు 10 వేల మంది భక్తులు అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు వేమూరి బాలకృష్ణ, ఆలయ కమిటీ అధ్యక్షుడు పసుపులేటి సాంబయ్య, సభ్యులు అంగిరేకుల శ్రీనివాస్, వేగే పూర్ణయ్య, బోయపాటి నరసింహారావు, సత్రం కృష్ణ పాల్గొన్నారు.



భక్తులకు భోజనం పెడుతున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి

26న శ్రీలక్ష్మీతిరుపతమ్మ కల్యాణ వేదిక ప్రారంభోత్సవం

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ దేవస్థానం ఆవరణలో నూతనంగా నిర్మించిన కల్యాణ వేదికను ఈ నెల 26న ప్రారంభిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆలయ కమిటీ కోశాధికారి జాస్తి ఫణికుమార్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జాస్తి చౌదరయ్య, సుశీలదేవి సౌజన్యంతో గ్రామస్తుల సహాయ, సహకారాలతో శ్రీలక్ష్మీతిరుపతమ్మ కల్యాణ వేదికను నిర్మించినట్లు చెప్పారు. జీ ప్లస్ టూ కల్యాణ వేదికలో గ్రౌండ్ ఫ్లోర్ డైనింగ్ హాలు, ఫస్ట్ ఫ్లోర్‌లో పంక్షన్ హాలు, సెకండ్ ఫ్లోర్‌లో గెస్ట్ రూమ్, వెయిటింగ్ హాల్‌ను నిర్మించినట్లు తెలిపారు. నూతన కల్యాణ వేదికను ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.



నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీతిరుపతమ్మ కల్యాణ వేదిక

కార్మికులకు బీమా కార్డులు అందజేత

కంకిపాడు: బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కంకిపాడు ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి అన్నారు. గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఈ–శ్రమ బీమా పథకం కింద కార్డులను గురువారం పంపిణీ చేశారు. బీమా పథకం వర్తింపునకు అయ్యే పూర్తి ఖర్చును రాచూరి ఫౌండేషన్ నుంచి వెచ్చిస్తున్నట్లు చిరంజీవి ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ ఆపద సమయంలో బీమా కుటుంబానికి ధీమా కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో ఈఓ సాంబశివరావు, వార్డు సభ్యుడు చిట్టూరి కోటయ్యబాబు, నేతలు బాకీ రాజు, కంకిపాటి రమేష్ పాల్గొన్నారు.



బీమా కార్డులు అందజేస్తున్న ఉపసర్పంచ్ చిరంజీవి